# అమ్మతనం

అత్రి మహర్షి తీర్థయాత్రకు బయల్దేరుతున్నారు. ప్రయాణ ఏర్పాట్లు చేస్తోంది అనసూయ. మార్గ మధ్యలో జపతపాలకీ ఆహార నిద్రలకీ అవసరమైన ముఖ్య వస్తువుల్ని మూట కడుతోంది. దర్భలు మొదలు కందమూలాల వరకూ ఏదీ మరువకుండా సమస్తమూ చకచకా సర్దేస్తోంది.

ఎంతో శ్రద్ధగా ఇంకెంతో ముందుచూపుతో మరెంతో భక్తితో చక్కబెడుతున్న భార్యవంక అపురూపంగా చూస్తూండిపోయారు మహర్షి.

పని మధ్యలో తలెత్తిన అనసూయ పెనిమిటి చూపుల్ని గమనించి మందహాసం చేసింది. "పతి భక్తిలో నీకుసాటి రాగలవారు లేరు అనసూయా"

"ఓహో. మీ పత్నికి మీరే ప్రశంసా పత్రాన్ని బహూకరిస్తున్నారన్నమాట"

"నా పత్నివన్న అభిమానంతోనో అనురాగంతోనో చెప్పడం లేదు. నిన్ను మించిన పతివ్రత మరొకరుంటారనుకోను"

"మీ వాక్కు సత్యమైతే అందులో సగభాగం మీదే అవుతుంది స్వామీ. మీ ప్రేమానురాగాలు అచంచలం. అమృతతుల్యం. ప్రాణిశ్రేష్ఠిని సమభావంతో సమాదరంగా చూడగల మీ దృష్టి మీ జ్ఞానం అమోఘం! అపూర్వం!"

మహర్షి చిన్నగా నవ్వబోయారు. గాని నవ్వురాలేదు. నిట్టూర్చారు. కలవరపడింది అనసూయ.

"ఏమిటి స్వామీ ఏదైనా అపరాధమా? అనకూడని మాట అన్నానా?"

"లేదు లేదు. కలలో కూడా అపరాధం చెయ్యని సత్శీలివి"

"మరి మీ నిట్టూర్పుకి కారణం తెలుసుకోవచ్చా?"

"ఉత్తమపత్నివి. మహోత్తమ మాతవి కూడా అయివుంటే స్త్రీత్వం సంపూర్ణమయ్యేది కదా అన్పించింది"

"ఏమో. మీ ఆశీర్వాద మహిమతో అవుతానేమో. సాక్షాత్తూ ఆ పరంధాముడి చేతే అమ్మా అని పిలిపించుకుంటానేమో"

ఆమె మాటలకి నివ్వెరబోయారు అత్రి. 'ఏమిటీమెధీమా! ఎక్కడిదీమెకింత ధైర్యం!' అన్నట్టుగా చూశారు.

నిండు కుండలా నవ్వింది అనసూయ.

క్షణకాలం కళ్ళు మూసుకున్నారు. భవిష్యత్తు మనోనేత్రం ముందు ప్రత్యక్షమయింది. ఆయన పెదవుల మీద చిరునగవు మొలిచింది. కళ్ళు తెరచి అభినందన పూర్వకంగా చూశారు. ఆమెని సమీపించి ఆమె శిరస్సు మీద కుడిచేయి వుంచి "తథాస్తు" అన్నారు.

"ధన్యోస్మిని స్వామీ" పాదాభివందనం చేసింది.

"వెళ్ళొస్తాను. నిన్ను ఒంటరిగా వదలి వెళ్తున్నాన్న దిగులు నాకిప్పుడు లేదు. నువ్వూ నీ ద్వారా నేనూ తరించనున్నాం"

ఆయన భావం అర్థమయ్యీ అర్థమవ్వనట్టనిపించింది. అయినా మరి ప్రశ్నించలేదు. శుభం జరుగుతుందన్న ఆశ నమ్మకం మరి ప్రశ్నింప నివ్వలేదు.

వెళ్తోన్న భర్త వంక కన్పిస్తున్నంత సేపూ చూస్తూ నిలబడింది అనసూయ. పిమ్మట ఆశ్రమంలోని అన్ని రకాల ప్రాణులకీ ఆహారం పెట్టింది. నీరు త్రాగిపించింది. ఎండు కట్టెలు తెచ్చి వంట ప్రారంభించింది. ఇంతలో వాకిట నిలబడి ఎవరో పిలిచినట్టుగా అన్పించింది.

చెవులు రిక్కించింది.

"భిక్షాందేహి..." సంశయిస్తూనే అర్థించారెవరో

చటుక్కున లేచి మట్టి కడవలోని పళ్ళూ కాయలూ చీర కొంగులో వేసుకుని ఒక్కుదుటున వాకిట్లోకెళ్ళింది.

ముగ్గురు పురుష పుంగవులు నిలబడి వున్నారు. ఒకరు పసుపు రంగు వస్త్రం ధరించి వుండగా మరొకరు పులిచర్మం ధరించి ఒడలంతా బూడిద పూసుకున్నారు. మూడవవారు కళ్ళు మూసుకుని మీన మేషాలు కాబోలు లెక్కిస్తున్నారు.

చిత్రం. వారెవరి దగ్గరా జోలె లేదు. అసలు భిక్షాందేహులై వచ్చినట్టుగానే లేరు. భిక్షాటకుల్లానో పాదచారుల్లాగానో గాక దివ్య పురుషల్లా వున్నారు.

వారు కలవరపడ్డారు.

వారు మహాత్ములని ఆమె దివ్య చక్షువులు గ్రహించాయి.

అప్రయత్నంగా చేతులు జోడించింది. వారు తడబడ్డారు. ఏదో చెప్పాలనుకున్నారు. ఎలా చెప్పాలో తోచక తికమక పడ్డారు. చిన్నగా నవ్విందామె. తనకంతా తెలుసునన్న భావం ధ్వనించిందా నవ్వులో. ముగ్గురూ ముఖాముఖాలు చూసుకున్నారు.

"స్వీకరించండి స్వామీ" పండ్లని అందివ్వబోయింది.

"అహహ. ఇప్పుడు కాదు. మేం సంధ్యావందనం పూర్తి చేసుకుని వస్తాం"

అబద్ధం చెప్పి దొరికిపోయిన పిల్లాడ్ని చూసి నవ్విన తల్లిలా నవ్వింది అనసూయ. "ఇది సంధ్యవేళకాదు. అపరాహ్ణ వేళ..."

"అఁ...ఆహఁ... అవునవును. స్నానం చేసి శుచియై వస్తాము. నీవు సైతం శుచియై మైలరహితవై మాకు ఆతిధ్యమివ్వాలి. శాకపాకాలు అవసరం లేదు సుమా" పసుపు వస్త్రధారి అన్నాడు.

"అలాగేస్వామీ. మీరు కోరినట్టే ఇస్తాను. కోరిందే ఇస్తాను. స్నానాదులు ముగించుకొని రండి"

"మాట తప్పరాదు సుమా" బూడిద పూసుకున్నతను అన్నాడు.

"మీ ముందు నేనెంత స్వామీ? మిమ్మల్ని అండపిండ బ్రహ్మాండమని భావిస్తే మీ ముందు నేను కేవలం పిపీలికాన్ని అవుతాను. మీ కిచ్చిన మాట తప్పి పాపాన్ని మూట గట్టుకుంటానా చెప్పండి?"

"అహ. అలా అని కాదు గాని నువ్వు ఒకరి పత్నివి. మేం పరపురుషులం. అందుకని.." మీన మేషాలు లెక్కించడం ఆపి అన్నాడు మూడో మూర్తి.

"మీరు అతిథిదేవుళ్ళు. సర్వం తెలిసిన మహానుభావులు. నన్నిలా మాటల్తో పరీక్షించటం తగదు. కోరి వచ్చిన అపూర్వ అవకాశాన్ని చేజార్చుకునే మూర్ఖురాల్ని కాదని హామీ ఇస్తున్నాను స్వామీ"

పసుపు బట్టలాయన తలగోక్కున్నాడు. మిగతా ఇద్దరి ముఖాలూ కందగడ్డలయ్యాయి. కళ్ళతో ఏవో సైగలు చేసుకున్నారు. "సరే అదీ చూద్దాం" అనుకున్నారు.

"మేం వేగిరం వస్తాం. అసలే ఆకలితో వున్నాం. మరేమీ ఆలస్యం చెయ్యకుండా మా క్షుద్బాధని తీర్చాలి సుమా"

"ఆవశ్యం తప్పకుండా స్వామీ. మీ ఆకలి నాకు తెలుసు గదా..."

మళ్ళీ ముగ్గురూ ముఖాముఖాలు చూసుకున్నారు. పిమ్మట ముఖాలు చాటు చేసుకుని తడబడుతోన్న అడుగుల్తో మడుగు వైపు వెళ్ళారు.

ఆనందం-కాదు బ్రహ్మానందం ఉప్పెనయై నిలువెల్లా చుట్టెయ్యగా పరమానంద పడిపోయింది అనసూయ. కారు మబ్బుల్ని చూసిన నెమలిలా ఆడాలన్పించింది. మావి చిగురు మెక్కిన కోయిలలా పాడాలన్పించింది. అంతలోనే ఏదో స్ఫురణకి రాగా గబ

గబా కుటీరమంతా వెదికింది. ఆశ్రమం చుట్టూ కల తిరిగింది. అపూర్వ అతిథులకి ఏం వడ్డించాలి? వారి ఆకలి బాధనెలా తీర్చాలి? శాకపాకా లొద్దన్నారాయె! పళ్ళు తీసింది. మళ్ళీ తిరిగి పెట్టేసింది. పరుగు పరుగున వెళ్ళిపట్టు తేనె పిండి తెచ్చింది. మళ్ళీ ప్రక్కన వుంచేసింది. దుంపలు శుద్ధి చేసింది. ఆ వెంటనే ప్రక్కకి తోసేసింది.

"అయ్యో అయ్యో! ఏం పెట్టాలి? వాళ్ళు వచ్చే వేళయ్యిందే. అసలే ఆకలి మీద వున్నామన్నారే ఎలా... ఎలా...?!"

కలవరపడింది. కంగారుపడింది. ఇంట్లోంచి బయటికీ బయటి నుంచి ఇంట్లోకీ కాలు గాలిన పిల్లిలా తిరిగింది. ఏమీ తోచట్లేదు. తోచింది నచ్చట్లేదు.

ఇంతలో అతిథులు రానే వచ్చారు. కలవరపడుతూ ఆహ్వానించింది. నేల మీద పులిచర్మం పరచి ఆసీనులుకమ్మంది.

వంట తాలూకు వాసనల కోసం కాబోలు ముక్కుపుటాలెగరేస్తూ చూశారు ముగ్గురూ. ఎలాంటి ఘుమఘుమలూ అందలేదు. కళ్ళెగరేసి చూశారు.

"కూర్చోండి స్వామీ..."

కూర్చుని ఆమె వంక చూశారు. పాముని చూసినట్టు తుళ్ళిపడ్డారు "ఏమీ. ఇలాగే వడ్డిస్తావా?" హుంకరించాడు పులి చర్మధారి.

"మడి వస్త్రమే స్వామీ.."

చటుక్కున లేచి నిలబడ్డారు. "మైలరహితంగా వడ్డించాలని చెప్పేం గదా" అన్నాడు మీన మేషాలు లెక్కించే మనిషి.

"మైలరహితమనగా మా ఉద్దేశము వస్త్రరహితము..." ముఖం ప్రక్కకి తిప్పుకుని అన్నాడు పసుపు దుస్తులు ధరించినాయన.

"స్వామీ!"

ఊహకందని కోరికకి వాడిబాణం తగిలిన పక్షిలా విలవిల్లాడుతూ చూసింది. నిలువునా కంపిస్తూ ప్రాధేయ పూర్వకంగా చూసింది.

"అన్నీ తెలిసిన మహాత్ములు మీరు. పరసతిని కోరాల్సిన కోరికేనా ఇది?" నిస్సహాయంగా చూస్తూ అడిగింది.

"అవన్నీ మాకు తెలీదు. మా కోరిక తీరుస్తావా లేదా?"

"మా ఆకలి తీర్చలేనని చెప్పు వచ్చిన దారినే వెళ్ళిపోతాం"

"చూస్తోంటే అతిథి సత్కారం మీద కన్నా మహా పతివ్రతనన్పించుకోవాలన్న దాని మీదే నీకు గురి ఉన్నట్టుంది." ఒకరి తర్వాత ఒకరు వరుసగా బాణాలు సంధించారు.

అవి ఆమె మన: ప్రాణాల్ని చీల్చిచెండాడగా బేలగా చూసింది.

కళ్ళల్లో కన్నీటి పొర భళ్ళున బ్రద్దలవ్వగా బాధగాచూసింది. కించిత్తు జాలిగానూ చూసింది. అయినా వారు కరగలేదు. పట్టిన పట్టు వదిలేట్టూ లేరు.

"కూర్చోమన్నావా వెళ్ళపొమ్మన్నావా?"

"అసలే ఆకలితో అగ్గగ్గలాడుతున్నాం. పడ్డిస్తావా వేరే ఇల్లు చూసుకోమా?"

"నీ పాతివ్రత్యవ్రతానికి భంగం కలుగుతుందనుకుంటే ఆ సంగతి చెప్పేసేయ్ ఆకల్తో నిష్క్రమిస్తాం." ముగ్గురూ బెదిరింపు అస్త్రాలు ప్రయోగించారు.

నిమేషకాలం కళ్ళు మూసుకుని పతి దేవుడ్ని తలచుకుంది. ఒక నిశ్చయాని కొచ్చింది.

"మీ ఆకలి తీర్చడం నా విద్యుక్తధర్మం. అందుకోసం ఏమైనా చేస్తాను తప్ప మిమ్మల్ని ఆకల్తో సాగనంపను. ఆసీనులు కండి స్వామీ" అనసూయ అంది.

"వివస్త్రవై వడ్డిస్తావా?" నమ్మకం చిక్కక అడిగాడు పసుపు వస్త్రధారి.

"మీ కోరిక తీర్చటమంటే జన్మధన్యత చేసుకోవడమే కదా స్వామీ" అనసూయ మాటలకి "సరే కానివ్వు" అంటూ పద్మాసనం వేసుక్కూర్చున్నారు ముగ్గురూ.

అనసూయ  పూజా పీఠం దగ్గరికెళ్ళింది. సర్వ దేవతలకీ మొక్కింది. జగన్మాతని ప్రార్థించింది.

"త్వరగా రావాలి" తొందరపెట్టారు.

పూజా పీఠంలోని పంచపాత్ర తీసుకుని వారి దగ్గరికెళ్ళింది. ఆమె ఏం చెయ్యనుందో అర్థంకాని వాళ్ళె చిత్రంగా చూశారామెవంక. ఉద్ధరిణితో ఉదకం తీసుకుని ఆ ముగ్గురి మీదా చిలకరించింది అనసూయ.

అద్భుతం! పరమాద్భుతం!!

ముగ్గురూ నెలల పాపలైపోయారొక్కసారిగా. ఆరున్నొక్క స్వరం అందుకుని దొర్లసాగారు. గబుక్కున వస్త్రాన్ని విసర్జించింది. ఆ ముగ్గురు పాపల్ని సందిట్లోకి తీసుకుంది. ఆకలి కాగలేక గుక్కపెట్టి ఏడుస్తున్నారు బాలలు ముగ్గురూ.

మరుక్షణం ఆమె వక్షంలో అపూర్వమైన మార్పు వచ్చింది. క్షణాల్లో పాలధార

పొంగింది. ఒకరి తర్వాత ఒకరు ఒకేసారి ఇద్దరు మాతృమమకారాన్ని తనివి తీరా జుర్రుకున్నారు. వారిని గుండెలకి హత్తుకుని వారి తలలూ వీపు నిముర్తూ తన్మయురాలయ్యింది. జన్మసార్థకతేదో చేజిక్కినట్టు అనుభూతి పొందింది అనసూయ.

అనంతరం కట్టు వస్త్రాన్ని చెట్టుకొమ్మకి వేసి మూడు ఊయలలు చేసింది. ముగ్గుర్నీ పరుండబెట్టి ఊపింది. జోలపాటలు పాడింది. ముద్దుచేసింది. గోరుముద్దలు తినిపించింది. చందమామని చూపిస్తూ కథలు చెప్పింది. కోయిల గొంతుతో పాటలు పాడి నిద్రపుచ్చింది.

రోజులు క్షణాల్లా గడుస్తున్నాయి.

అనసూయకి పిల్లల ధ్యాసా వారి అలనాపాలనా తప్ప మరేమీ పట్టడం లేదు. ఆశ్రమ విధుల్ని సైతం విస్మరించి రేయింబవళ్ళూ పిల్లల సేవలో నిమగ్నమైపోయింది. ఆ పసివారికెలాంటి అసౌకర్యమూ కలక్కుండా నిద్రకి సైతం వెలియై కంటికి రెప్పలా అంటి పెట్టుకునుంటోంది.

ఆ ముప్వురూ మాతృ మమతాను బంధంలో బంధీలైపోయారు. ఆమె మాతృత్వపు క్షీరామృతాన్ని పంచిస్తోంటే జన్మ జన్మలకీ సరిపోయేంత గ్రోలుతున్నారు వాళ్ళు. వాళ్ళని నవమాసాలు మోసి కనకపోయినా అంతకు మించిన బంధాన్నేదో అల్లుకుని అమ్మతనాన్ని పండించుకుంది అనసూయ.

అత్రి మహర్షి ఆశ్రమం ఆ పరిసరాలూ తప్ప ముల్లోకాలూ అల్లకల్లోలమైపోయాయి. గ్రహాలు గతి తప్పాయి. సముద్రాలు పొంగాయి. అగ్ని పర్వతాలు బద్దలయ్యాయి. రాక్షసాంశలు పురివిప్పసాగాయి. మహాప్రళయం రానుందని బెంబేలుపడిపోయారంతా.

మహర్షులూ దేవతలూ కలసి మొరపెట్టుకోడానికి బ్రహ్మదగ్గరి కెళ్ళారు. ఆయన లేరు. విష్ణువు దగ్గరికెళ్ళారు. ఆయనా లేరు. మహేశ్వరుడి నివాసానికెళ్ళారు. ఆయన జాడా తెలీలేదు.

సృష్టి స్థితిలయకారులేమైపోయారో తెలీక అల్లల్లాడిపోయారు. ఆందోళనా భరితులయ్యారు. దరీ దిక్కూ తోచని వారయ్యారు. దిక్కు లేనివారయ్యారు.

ఒకేసారి తమ పతులంతా తమకి మాట మాత్రమైనా చెప్పకుండా ఎక్కడికెందు కెళ్ళారో తెలీక లక్ష్మి, సరస్వతి, పార్వతి సతమతమై పోసాగారు. మనసేదో కీడుని శంకిస్తోంటే తల్లడిల్లిపోయారు.

సరిగ్గా అప్పుడు జగన్నాటక సూత్రధారి నారద మహర్షి వచ్చి జరిగిందంతా 'చల్లగా' చెప్పేరు. ఆ ఘోర కలి గురించి విని సరస్వతి స్పృహ తప్పిపోగా నీళ్ళు చిలకరించి సేదదీర్చారు మిగతా ఇద్దరూ.

"అకట! మా పతులు పసిపిల్లలైపోయారా?! మాకు తోడు నీడగా నడవాల్సిన వాళ్ళు నేల మీద ప్రాకుతున్నారా! ఎంతటి వైపరీత్యం! ఇక మా గతేమిటి? మా కేది దారి నారదా?" ముగ్గురూ సామాన్య పత్నుల్లా విలపిస్తూ ఏక కంఠంతో ప్రశ్నించారు. అభ్యర్థించారు.

చిద్విలాసంగా నవ్వేరు నారద మహర్షి. "వాళ్ళిప్పుడు త్రిమూర్తులూ కాదు మీ పతులూ కాదు. కేవలం అనసూయమ్మ ముద్దుల తనయులు. అంతే"

"మరిప్పుడెలా? ఆ ఘోరాన్ని మార్చే మంత్రమేదో మీరే ఉపదేశించాలి" ప్రాధేయపడ్డారు.

"బ్రహ్మచారిని. సంసారమోహాలూ సంతాన వ్యామోహాలూ తెలీని వాడ్ని. నేనేం చెయ్యగలను చెప్పండి. ఏం చేసినా ఏం చెప్పినా ఆ అనసూయ చెప్పాలి. వెళ్ళి మీ ముక్కులేవో అక్కడే చీది మీ ప్రశ్నలేవో ఆవిడ్నే అడగండి. ఏదో తారక మంత్రం ఉపదేశించకపోదు" అని చెప్పి, నారాయణ జపం చేస్తూ జారుకున్నారు నారదుడు.

"ఇంక చెయ్యడానికేం మిగిలి ఉంది గనుక! లెంపలేసుకుని మన తరపున మన పతుల్ని క్షమించమని అనసూయనే అర్థిద్దాం, పదండి" అంది సరస్వతి.

"ఒక మానవ స్త్రీ దగ్గరకు మనం వెళ్ళి ప్రాధేయపడటమా? ఇంతకంటే అవమానం ఇంకోటి వుంటుందా"? ముక్కు పుటాలదుర్తోంటే అంది పార్వతి.

"అది నిజమేగాని ఇప్పుడు మన భర్తలు ఆవిడ ఆధీనంలో వున్నారు. ఆ సంగతి మరచిపోకు. లేనిపోని బింకాలు మాని వెళ్దాంరా" హితవు చెప్పింది లక్ష్మి.

"ఇంకో  సంగతి చెప్పనా? ఆ అనసూయ ఇప్పుడు సామాన్య స్త్రీ కానే కాదు. జగత్ ప్రభువులు త్రిమూర్తులకి మాతృమూర్తి. మనకి అత్తగారవుతుంది తెలుసా?" అంటూ కొత్త సంగతి చెప్పింది సరస్వతి.

"అదీ నిజమే! సరే ఏం చేస్తాం. మగవాళ్ళు చేసిన తప్పుని ఆడవాళ్ళే సరిదిద్దాలి. లేకపోతే గ్రహాల గమనం ఆగిపోతుంది. ప్రళయం వచ్చి తీరుతుంది. ఏ యుగంలోనైనా ఇంతే మరి" అంది లక్ష్మి.

"మగాళ్ళు అసమర్థులైతే నీతి తప్పి ప్రవర్తిస్తే దారిలోకి తేవాల్సింది తేగలిగింది ఆడవాళ్ళేగాని పదండి పదండి. అక్కడ మన పతులేం ఇబ్బందులు పడుతున్నారో ఏమో పాపం" తొందర పెట్టింది పార్వతి.

ఆఘమేఘాల మీద ముగ్గురూ అత్రి మహర్షి ఆశ్రమానికెళ్ళారు.

అల్లంత దూరాన వుండగానే పిల్లల కేరింతలు విన్పించాయి. బుగ్గలు నొక్కుకుంటూ సమీపించారు.

ముగ్గురు పిల్లలకీ పాలు ఇస్తూ, లాలిస్తూ ముద్దూ ముచ్చటా చేస్తూ మురిపాలు పండిస్తోంది అనసూయ. అమ్మ అవ్యాజానురాగధారల్లో నిలువునా తడసి ముద్దైపోతున్నారు పసిపాపలు మువ్వురూ. ఆ తల్లీ బిడ్డల ఆటలూ పాటలూ పూసులూ వుంగా వుంగాలూ కథలూ కబుర్లూ వింటూ చూస్తూ మైమరచిపోయారు లక్ష్మీ, సరస్వతీ, పార్వతీనూ.

వారికి ముగ్గురమ్మల ముద్దు ముచ్చటల్లో తేలియాడిన దశరథ రాముడు గుర్తొచ్చాడు. అప్పుడు ముగ్గురమ్మలకీ ఒకే బిడ్డడు. ఇప్పుడు ముగ్గురు బిడ్డలకీ ఒకే అమ్మ!

ఒకర్ని ఎక్కువా ఒకర్ని తక్కువా చెయ్యకుండా ముగ్గుర్నీ పేగుతెంచుకు పుట్టిన బిడ్డల్లానే చూస్తూ పాలు ఇస్తూ మురిపాలు పండిస్తోంది అనసూయ.

ఆమెలో జగన్మాత అంశ కన్పిస్తోంటే సృష్టికి మూలమేదో తెలిసినట్టు అన్పిస్తోంటే ఆమెని సమీపించి నమస్కరించారు ముగ్గురూ.

స్వపరిచయమ్మాక, "మా పతుల్ని మాకిచ్చి పుణ్యం కట్టుకో అనసూయా. వాళ్ళు చెయ్యకూడని తప్పు చేశారు. కోరకూడని కోరిక కోరారు. అందుకోసం వారికి విధించిన శిక్ష చాలు. దయచేసి మా పతుల్ని విడిచిపెట్టు. మా కోసమే కాదు లోక కళ్యాణార్ధం వాళ్ళు మళ్ళీ త్రిమూర్తులవ్వాలి. క్షమించి విడిచి పెట్టు" అన్నారు.

"ఊహు. వీళ్ళు నా కన్నులు. నా కన్నుల వెన్నెలలు. వీళ్ళని వదలను. వదలలేను. వదిలి వుండలేను" పిల్లల్ని గుండెలకి హత్తుకుంటూ అంది అనసూయ.

"నువ్వలా అంటే మేమేమైపోవాలి చెప్పు? మా పతులు చేసిన సిగ్గు మాలిన పనికి మేం సిగ్గుతో చితికిపోతూ చెంపలేసుకుంటున్నాం. వాళ్ళని క్షమించు" కన్నీళ్ళతో అర్థించారు.

"ఛా ఛా! వీళ్ళని నేను క్షమించడం ఏమిటి! వీళ్ళు నా వరాల పుత్రులు. అమ్మతనపు మాధుర్యపు రుచి చూపించిన అపురూప మూర్తులు. మారు జన్మలేకుండా నా బ్రతుకు పండించిన కుమారులు.."

దిక్కుతోచలేదు ముగ్గురు పత్నులకీ, బిక్కచచ్చి ముఖాలు వ్రేలాడేసుకుని దిక్కులు చూస్తోంటే నారద మహర్షి "నారాయణ నారాయణ" అంటూ ప్రత్యక్షమయ్యారు.

"హమ్మయ్య! సమయానికొచ్చావు నారదా. ఈ చిక్కుముడి నువ్వే విప్పాలి" అంది లక్ష్మి.

"నేనెప్పుడూ సమయానికే విచ్చేస్తానుగానీ ఇంతకీ మీ మొర అనసూయ మాతాశ్రీ ఆలకించినట్టా లేనట్టా"

జరిగిన సంభాషణంతా వివరించారు.

"ఇది నా వల్లకాదు. పసివాళ్ళని పెద్దవాళ్ళని చెయ్యాలి. ఆపైన మీ కప్పగించాలి. గెడ్డాలొచ్చిన కొడుకుల్నే కోడళ్ళకి ధారాదత్తం చెయ్యడానికి ఏ తల్లీ ఒప్పుకోదాయె. ఇహ అడ్డాలలోని బిడ్డలనెలా అప్పగిస్తుంది చెప్పండి. ఉహూఁ అసాధ్యము కాదు అసంభవము!"

"అలా అనకు నారదా. కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటే కాదు. నువ్వే ఏదో ఉపాయం ఆలోచించాలి. మా ఇక్కట్లు కడతేర్చాలి"

అర్థింపు స్వరంతో అంది సరస్వతి.

"దీనికి పరిష్కారం అత్రి మహర్షి సూచించాలి. అదిగో తీర్థయాత్రలు ముగించుకుని వారే వస్తున్నారు. ఆలస్యం ఎందుకూ ఎదురెళ్ళి అడగండి."

త్రిమూర్తుల సతులెళ్ళి అత్రి మహర్షికి నమస్కరించి జరిగిన వృత్తాంతమంతా వివరించి లెంప లేసుకున్నారు.

వారికి హామీ ఇచ్చి భార్యని సమీపించారు మహర్షి

"వచ్చారా? రండి రండి మన బిడ్డలండీ" అంటూ ముగ్గురు బిడ్డల్నీ అందించింది అనసూయ. వారి నందుకుని ముద్దాడారు అత్రి మహర్షి. వాళ్ళ ఆటపాటల గురించి అల్లరి గురించి వేనోళ్ళచెబుతోంటే అంతా చెవులప్పగించి మరీ విన్నారు. పుత్రోత్సాహము పొందుతూ పితృవాత్సల్యం కురిపించారు.

"అనసూయా! నువ్వు తల్లివయ్యావు. నీజన్మ ధన్యమైంది. ఇకనైనా వీరికి వీరి నిజారూపాలనిచ్చి మాతృబంధవిముక్తుల్ని చెయ్యి"

"స్వామీ! వీళ్ళు నా ఊపిరి నా పంచప్రాణాలు. వీళ్ళని విడిచి వుండలేను స్వామీ" పసివాళ్ళని గుండెలకి హత్తుకుంటూ అంది.

"బిడ్డకి అడ్డాల నాడు తల్లి కావాలి. గెడ్డాలొచ్చాక మరో తరుణి తోడు కావాలి. కని పెంచి పెద్ద చేసిన బిడ్డని మరొకరికప్పగించడం బాధాకరమే అయినా తప్పదు. తరువు కాయల్ని కాస్తుంది. ఇతరులకిస్తుంది. అంతే తప్ప తనే దాచుకోదు కదా"

"స్వామీ!" కన్నీళ్ళు చిప్పిల్లాగా వేదనగా అంది.

"ఇంకేం చెప్పొద్దు. వీరు సామాన్యులు కాదు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. జగన్నాటక సూత్రధారులు. సాక్షాత్తూ దేవదేవులు. నిన్ను జగన్నాధులకే అమ్మని చెయ్యాలని వచ్చిన త్రిమూర్తులు"

"కావొచ్చు. కాని నాకు మాత్రం నా స్తన్యం గ్రోలిని బిడ్డలేనండీ. నా క్షీరంతో జీవం నిలుపుకున్న పుత్రులండీ..."

"వాదనలొద్దు. నేచెప్పినట్టు నడచుకో అనసూయా"

హతాశురాలై చూసింది. పిమ్మట అనసూయ బిడ్డల్ని మరో మారు ముద్దాడి గబగబా లోపలికెళ్ళి ఉదకం తెచ్చి వారి మీద చిలకరించింది!

పసివాళ్ళు ముగ్గురూ త్రిమూర్తులయ్యారు. వారి పత్నుల నేత్రాలు ఆనంద భాష్పాలు వర్షించాయి. నారదుడు ఆనందంగా తిలకించారా అపురూప దృశ్యాన్ని.

త్రిమూర్తులు అనసూయకి నమస్కరించారు. "అమ్మా! మమ్మల్ని క్షమించు. మేం నీ పాతివ్రత్యాన్ని పరీక్షించడానికిరాలేదు. అమ్మతనపు అమృతత్వాన్ని జగతికి చాటాలని వచ్చాం. మధురమైన బాల్యాన్ని మళ్ళీ అనుభవించాలని వచ్చాం. అమ్మ అమృత అనురాగధారల్లో తడిసి తరించాలని వచ్చాం. యుగ యుగాలకీ సరిపడేంత మమతానురాగాల్నీ మధురానుభూతుల్నీ మూట గట్టుకున్నాం. మాకిక శలవిప్పించు తల్లీ"

కళ్ళనీళ్ళతో అనసూయ వీడ్కోలిస్తోంటే నారద మహర్షి అన్నారు "ప్రతి స్త్రీలోనూ అమ్మతనం వుంది. అది ఎప్పుడూ చల్లగా సజీవంగా వర్ధిల్లూతూండాలి. జీవనదిలా ప్రవహిస్తూండాలి. అప్పుడే సృష్టి నిరాటంకంగా సాగుతుంది. లేకపోతే తల్లులే కన్న బిడ్డల్ని అమ్మితే, పరాయి బిడ్డల్ని ఆడవాళ్ళే అంగటి సరుకుల్ని చేస్తే, అగ్నికి ఆహుతి ఇస్తే ఇక ఆ జాతికి భవిష్యత్తు వుండదు. ఆ దేశానికి ప్రగతీ వుండదు!"

(అపురూప సాహిత్య మాసపత్రిక)

జనవరి 2003